నెలాఖరులోపు పనులు పూర్తి చేయాలి

- మెడికల్ కళాశాలను పరిశీలించిన కలెక్టర్ శ్రీహర్ష
- జిల్లా దవాఖానలో ఆకస్మిక తనిఖీ

అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న నారాయణపేట జిల్లా కలెక్టర్ శ్రీహర్ష

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 22: ఈనెలాఖరులోపు మెడికల్ కళాశాల నిర్మాణ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. సోమవారం మండలంలోని అప్పక్‌పల్లి వద్ద నిర్మిస్తున్న నూతన జిల్లా దవాఖాన భవనంలో కొనసాగనున్న మెడికల్ కళాశాల వసతి సౌకర్యాల పనులను ఆయన పరిశీలించారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, లెక్చరర్, ప్రొఫెసర్, ట్యూటర్ రూంలు పరిశీలించారు. నిర్మాణం పూర్తయిన గదుల ముందు ఆయా శాఖల బోర్డులను పెద్దఅక్షరాలతో ఏర్పాటు చేయాలని చెప్పారు. అంతకుముందు పట్టణంలోని ప్రభుత్వ జిల్లా దవాఖానలో ఉన్న మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ గదిలో మెడికల్ కళాశాలకు అవసరమైన వైద్యుల జాబితాను పరిశీలించారు. మొత్తం 19మంది వైద్యుల ఆధార్ కార్డులను బయోమెట్రిక్‌తో అనుసంధానం చేయాలన్నారు. అదేవిధంగా ఇటీవలే ఏర్పాటు చేసిన కొత్తవార్డును, స్టోర్ రూంను పరిశీలించారు. కార్యక్రమంలో వైద్య విద్య డీఎంఈ శివప్రసాద్, మహబూబ్‌నగర్ మెడికల్ కళాశాల డైరెక్టర్ రమేశ్, నారాయణపేట మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాంకిషన్, జిల్లా దవాఖాన సూపరింటెండెంట్ రంజిత్‌కుమార్, ఆర్ఎంవో పావని తదితరులు పాల్గొన్నారు.

రైతుల మేలుకే కొనుగోలు కేంద్రాలు

దేవరకద్ర: నాగారంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ మోహన్‌రావు

- అదనపు కలెక్టర్ మోహన్‌రావు

దేవరకద్ర, ఏప్రిల్ 22 : అన్నదాతల కోసమే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అదనపు కలెక్టర్ మోహన్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని నాగారంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అనంతరం రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను ప్రైవేట్ వారికి అమ్మిమోసపోకుండా, రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే ధాన్యం విక్రయించాలన్నారు. ఇక్కడ ప్రభుత్వ మద్దతు ధరకే కొనుగోలు చేస్తారని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తెచ్చే సమయంలో తేమ శాతం చూసుకొని రావాలన్నారు. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లోగా ప్రభుత్వం రైతు వ్యక్తిగత ఖాతాల్లో డబ్బులు జమచేస్తుందన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ శంకర్‌నాయక్, ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆరబెట్టిన ధాన్యం తేవాలి

దేవరకద్ర, ఏప్రిల్ 22: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రానికి రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని తీసుకువచ్చి విక్రయించాలని జిల్లా వ్యవసాయధికారి వెంకటేశ్ రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని పెద్దరాజమూర్‌లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులనుద్దేశించి మాట్లాడుతూ తేమశాతం తక్కువగా ఉండి, నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువస్తే మంచి ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి రాజేంద్ర ఆగర్వాల్, రైతులు తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆల పరామర్శ

వెంకట్‌రెడ్డి పార్థివ దేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

దేవరకద్ర రూరల్(కౌకుంట్ల), ఏప్రిల్ 22: చిన్నచింతకుంట మండలం దమగ్నాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యూత్ అధ్యక్షులు సత్యనారాయణ తండ్రి వెంకట్‌రెడ్డి ఆదివారం సాయంత్రం అనారోగ్యంతో మరణించారు. విషయం తెలిసిన మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోమవారం గ్రామానికి వెళ్లి పార్థివదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. అలాగే కౌకుంట్ల మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీపీ ఈవీ గోపాల్ అనారోగ్యంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ సందర్భంగా ఆయనను పరామర్శించి ఆరోగ్యపరిస్థితిని తెలుసుకున్నారు. అనంతరం కౌకుంట్లలో పలు శుభకార్యాలలో పాల్గొన్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

నారాయణపేట, ఏప్రిల్ 22 : హనుమాన్ జయంతి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ అన్నారు. సోమవారం ఆయన ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతూ హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లా పరిధిలో మొత్తం 79 హనుమాన్ శోభాయాత్రలు నిర్వహించనున్నారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అవసరమైన చోట ప్రధాన చౌరస్తాల్లో పోలీస్ పికెట్స్, సీసీ కెమెరాల ద్వారా నిఘా, కమాండ్ కంట్రోల్ నుంచి మానిటరింగ్ చేస్తామని చెప్పారు. సామాజిక మాధ్యమాలపై పూర్తి నిఘా ఉంచామని, ఒకరిని కించపరిచేలా, అనవసరమైన పోస్టులు వైరల్ చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. శోభాయాత్ర జరిగే సమయంలో ట్రాఫిక్ జామ్ జరుగకుండా ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని పోలీసులకు సూచించారు. శోభాయాత్ర నిర్వహించే సమయంలో యువకులు సంయమనం పాటించాలని సూచించారు.

నేడు మిడ్జిల్‌లో కార్యకర్తల సమావేశం

మాట్లాడుతున్న మండలాధ్యక్షుడు పాండు

మిడ్జిల్, ఏప్రిల్ 22: మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించే పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని విజయవంతం చేయాలని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు, ఎంపీపీ సుదర్శన్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో బాల్‌రెడ్డి నివాసంలో మండల ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. మంగళవారం ఎంవీఎస్ గార్డెన్‌లో నిర్వహించే బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి వస్తున్నట్లు తెలిపారు. ప్రతి గ్రామం నుంచి కార్యకర్తలు పెద్దసంఖ్యలో రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుధాబాల్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, శ్రీనివాసులుగుప్తా, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నరసింహారెడ్డి, నారాయణరెడ్డి, శ్రీనివాసులు, వెంకటయ్య, భీమ్‌రాజు, బంగారు, నవీనాచారి, జగన్‌గౌడ్, గోపాల్, సుకుమార్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు పోలీసులు అండగా ఉండాలి

- జిల్లా ఎస్పీ హర్షవర్ధన్

ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ

మహబూబ్‌నగర్ మెట్టుగడ్డ, ఏప్రిల్ 22: ప్రజలకు అన్యాయం జరిగితే పోలీసులు అండగా ఉండాలని మహబూబ్‌నగర్ ఎస్పీ హర్షవర్ధన్ అన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఆయన తన చాంబర్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆయన ఫోన్ చేసి ఆదేశించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హైదరాబాద్‌లో ఆర్థికంగా స్థిరపడడానికి అద్భుత అవకాశం కష్టపడి పనిచేసే వారికి మంచి సంపాదన, ఫ్రీ వసతి + భోజనం కలదు. ఫోన్: 8121748850
NT-340425

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/- Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

ఈ-పాస్ దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 22: 2024-25 విద్యా సంవత్సరానికి ఎస్సీ, ఎస్టీ, ఈబీసీ, బీసీ, మైనార్టీ దివ్యాంగుల విద్యార్థులకు ఇంటర్ విద్యతోపాటు ఐఐటీ, ఏఐఈఈఈ, ఎంసెట్ కోర్సులకు కోచింగ్ ఇచ్చేందుకు గానూ జిల్లాలోని ప్రైవేటు జూనియర్ కళాశాల(కార్పొరేట్ కళాశాలలు) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ రవినాయక్ ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల కోచింగ్ నిర్వహించేందుకు ఆసక్తిగల కళాశాల యాజమాన్యాలు తమ దరఖాస్తులను ఈ-పాస్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని, ఈనెల 27లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత ధ్రువపత్రాలను ఎస్సీడీడీ మహబూబ్‌నగర్ జిల్లా కార్యాలయంలో అందజేయాలని తెలిపారు. దరఖాస్తులను కళాశాలల జిల్లా కమిటీ ద్వారా 28న ఎంపిక చేస్తారని పేర్కొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సమానం

మరికల్, ఏప్రిల్ 22: క్రీడల్లో గెలుపు, ఓటమిని సమానంగా స్వీకరించాలని బీఆర్ఎస్ నాయకులు హన్మిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రెండ్రోజుల పాటు నిర్వహించిన ఉమ్మడి జిల్లా వాలీబాల్ పోటీల్లో విజేతలకు సోమవారం బహుమతులతో పాటు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలకేంద్రంలో బాలికల, బాలుర విభాగంలో వాలీబాల్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. బాలుర విభాగంలో మొదటి స్థానంలో నిలిచిన మద్దూర్ జట్టుకు రూ.50వేలు నగదు, ద్వితీయ స్థానంలో నిలిచిన షాద్‌నగర్ జట్టుకు రూ.35వేలు, తృతీయ స్థానంలో నిలిచిన మరికల్ జట్టుకు రూ.15వేలతోపాటు షీల్డ్‌లు అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేత నర్సిములు, నిర్వాహకులు రాజేశ్‌యాదవ్, బాలరాజు ఉన్నారు.

తాగునీటి సమస్యను పరిష్కరించిన అధికారులు

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

తాగునీటి బోరుకు మరమ్మతు చేసిన అధికారులు

హన్వాడ, ఏప్రిల్ 22 : మండలంలోని ఎర్రగట్టు తండాలో తాగునీటి కోసం గిరిజనులు పడుతున్న ఇబ్బందులపై సోమవారం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో కథనం ప్రచురణ కావడంతో అధికారులు స్పందించారు. ఎర్రగట్టుతండాకు మిషన్ భగీరథ ఈఈలు వెంకట్‌రెడ్డి, పుల్లారెడ్డి, ఈవోపీఆర్‌డీ వెంకట్‌రెడ్డి, మిషన్ భగీరథ ఏఈ యాదయ్య, గ్రామ కార్యదర్శి వెళ్లారు. గ్రామంలో పర్యటించి తాగునీటి సమస్యపై గిరిజనులను అడిగి తెలుసుకున్నారు. బోరు మోటర్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరందించే ఏర్పాటు చేశారు. దీంతోపాటు ప్రతి రోజు మిషన్ భగీరథ వాటర్ సరాఫరా అందించే చర్యలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. మిషన్ భగీరథ అధికారులు తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీ సుకోవాలని తెలిపారు. దీంతో గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు.

డిగ్రీ కళాశాలకు ఐఎస్‌వో సర్టిఫికెట్లు అందజేత

ఐఎస్‌వో సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎండీ శివయ్య

పాలమూరు,ఏప్రిల్22: మహబూబ్‌నగర్‌లోని ఎన్టీఆర్ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం ఐఎస్‌వో సర్టిఫికెట్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ మేనేజింగ్ డైరెక్టర్ ఏ శివయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ నుంచి ఐ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతి సంవత్సరం వివిధ విభాగాల్లో ప్రమాణాలు పాటిస్తున్న ప్రభుత్వ కళాశాలలకు ఐఎస్‌వో సర్టిఫికెట్లు ఇస్తోంది. ఈ క్రమంలోనే మూడు విభాగాలకు గ్రీన్ ఆడిట్, ఎనర్జీ ఆడిట్, అడ్మినిస్ట్రేటివ్ ఆడిట్ బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్స్ అని పిలువబడే ఐఎస్‌వో అనుగుణంగా ప్రమాణాలు పాటించినందుకు సర్టిఫికెట్స్‌ను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డా.విజయ్‌కుమార్ మాట్లాడుతూ మా కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర బృందం సమిష్టి కృషితో వీటిని సాధించుకోగలిగామన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అమీనా ముంతాజ్‌జహాన్, ఐక్యూసీ కోఆర్డినేటర్ డా.విజయలక్ష్మి, అకాడమిక్ కోఆర్డినేటర్స్ లావణ్య, సూరయ్య, జబీన్, లైబ్రేరియన్ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో ఆయిల్‌పాం తోటలకు జాగ్రత్తలు

- జిల్లా ఉద్యాన శాఖ అధికారి వేణుగోపాల్

ఆయిల్‌పాం తోటను పరిశీలిస్తున్న అధికారి

పాలమూరు, ఏప్రిల్ 22 : ప్రస్తుత వేసవిలో ఉష్ణోగ్రతలు 40డిగ్రీలకు చేరుకోవడం వల్ల ఆయిల్‌పాం తోటలపై యాజమాన్యం జాగ్రత్తలు తీ సుకోవాలని జిల్లా ఉద్యానవన శాఖ అధికారి వేణుగోపాల్ సూచించారు. సోమవారం ఆయన హన్వాడ మండలం టంకరలో ఆయిల్‌పాం తోటను పరిశీలించారు. కొత్తగా నాటి, ఎదుగుతున్న దశలో ఉన్న ఆయిల్‌పాం తోటలకు మూడేండ్ల వరకు ప్రతిరోజు 200 నుంచి 250 లీటర్ల నీరు అవసరం ఉంటుందన్నారు. దిగుబడినిస్తున్న పాత తోటలకు వేసవిలో ప్రతిరోజు 300నుంచి 350 లీటర్ల నీటి అవసరం ఉంటుందని తెలిపారు. నీటిఎద్దడి ఉన్న ఆయిల్‌పాం తోటల్లో పెద్ద మొత్తంలో నీరు కాకుండా కలుపు నుంచి రక్షించుటకు తేమను కాపాడుకొనుటకు మల్చింగ్ పద్ధతి పాటించాలన్నారు. జీలుగా, జనుము విత్తనాలను ఆయిల్‌పాం మొక్క పాదుల్లో రెండు వరుసలలో విత్తనాలు నాటుకోవచ్చని తెలిపారు. పెరిగిన జీలుగా లేదా జను ము వచ్చే వేడి గాలుల నుంచి ఆయిల్‌పాం మొక్కను కాపాడడమే కాకుండా పోషకాలను కూడా అందిస్తుందని తెలిపా రు. డ్రిప్ సిస్టంతోపాటు, ఇది వరకు ఇచ్చిన మైక్రో జెట్లు మొక్కకు ఇరువైపులా అమర్చి నీటితడులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యావనశాఖ అధికారులు,సిబ్బంది ఉన్నారు.

ప్రతి గింజను కొంటాం

పౌరసరఫరాల శాఖ కమిషనర్ చౌహాన్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 22 : రైతులకు ఇబ్బందిలేకుండా నాణ్యతా ప్రమాణాలను అనుసరించి ప్రతి వరి గింజను కొనుగోలు చేస్తామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్ నుంచి అన్నిజిల్లాల అదనపు కలెక్టర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సోమవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ కార్యాలయంలోని ఎస్ఐసీ సమావేశ మందిరంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు పౌరసరఫరాల శాఖ, వ్యవసాయ సంబంధిత శాఖల అధికారులు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నదాతలు ఇబ్బందులు పడకుండా ధాన్యం సేకరణ చర్యలు చేపట్టాలని, వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల అధికారి ప్రవీణ, డీపీఆర్‌వో శ్రీనివాస్ పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

మాగనూరు, ఏప్రిల్ 22: గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ముందుకు సాగాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి చెప్పారు. సోమవారం హర్ ఘువ్ - ఏక్ గంటె కార్యక్రమంలో భాగంగా మాగనూర్ మండలం అమ్మపల్లి వడ్వాట్ మాగనూర్ అడవి సత్యారం వివిధ గ్రామాల్లో పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు వాకిటి శ్రీహరి, ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలువురు వివిధ పార్టీల నుంచి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీ కండువా కప్పుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆనంద్ గౌడ్ ఎన్నికల ఇన్‌చార్జి గోపాల్‌రెడ్డి, మండల నాయకులు శివరామిరెడ్డి, వాకిటి శీను, సత్యనారాయణ, ఉజ్జలి కృష్ణయ్య, రవికుమార్, వివిధ గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే పరిశోధనపై ఆసక్తి ఉండాలి

ప్రొఫెసర్ ప్రశాంతమ్మను సన్మానిస్తున్న రాజ్‌కుమార్

పాలమూరు, ఏప్రిల్ 22: మహబూబ్‌నగర్ పాలమూరు విశ్వవిద్యాలయంలో సోమవారం వాణిజ్య శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో పరిశోధన పద్ధతి, ప్రాజెక్ట్ నివేదిక అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉస్మానియా విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు ప్రశాంతమ్మ హాజరయ్యారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పరిశోధన ప్రాముఖ్యత, విద్యార్థుల ఆలోచనల సడలి, విశ్లేషణ శక్తి పెరగడం గురించి వివరించారు. విద్యార్థి దశనుంచే ఈ రకమైన వక్తిత్వాన్ని పెంపొందించుకుంటే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు. వాణిజ్య రంగంలోని మార్పులకు అనుగుణంగా నూతన అంశాలపై పరిశోధనలు ఏ విధంగా చేయా లో వివరించారు. కార్యక్రమంలో ప్రొఫెసర్లు రాజ్‌కుమార్, అనురాధరెడ్డి, రంగప్ప, సురేశ్ పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల విరాళం

నవాబ్‌పేట, ఏప్రిల్ 22: మండలంలోని లింగంపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల పూ ర్వ విద్యార్థులు తమ ఉదారతను చాటుకున్నారు. పాఠశాల 2001-02 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు రూ.40వేలు వెచ్చించి పాఠశాలకు బెంచీలు అందజేశారు. సోమవారం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రతన్‌సింగ్, తిరుపత య్య, పూర్వ విద్యార్థులు వజీర్, సతీష్, గౌస్‌పాషా, సుధాకర్, రాఘవేందర్, లక్ష్మ ణ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దపొర్లలో మద్యం పట్టివేత

ఊట్కూర్, ఏప్రిల్ 22 : మండలంలోని పెద్దపొర్ల గ్రామంలో సోమవారం పోలీసులు దాడులు నిర్వహించి 16.6 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సై శ్రీనివాసులు మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండడంతో విశ్వసనీయ సమాచారం మేరకు పెద్దపొర్ల గ్రామానికి చెందిన బుగ్గప్ప ఇంట్లో మద్యం ఉందని తెలియడంతో దాడులు చేసి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మద్యం విలువ రూ.3,700 ఉంటుందన్నారు. అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్లాస్టిక్ రహిత ధరిత్రిని నిర్మిద్దాం

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ ధరిత్రి దినోత్సవం

మాట్లాడుతున్న అధ్యాపకురాలు సుభాషిణి

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 22: ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా జడ్చర్లలోని డాక్టర్ బీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వృక్షశాస్త్రం, ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పీయ చిన్నమ్మ మాట్లాడారు. మానవాళికి ఆధారమైన ధరణిని మానవులు స్వలాభం కోసం నాశనం చేస్తున్నారన్నారు. ప్లాస్టిక్ వాడకంతో భవిష్యత్‌లో భూగోళంపై జీవుల మనుగడ కష్టతరంగా మారనున్నట్లు తెలిపారు. భవిష్యత్ తరాల కోసం భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్లాస్టిక్ రహిత ధరిత్రి నిర్మాణం కోసం ప్రతిఒక్కరూ పర్యావరణం పట్ల అవగాహన కల్పించుకోవాలన్నారు. ప్లానెట్, ప్లాస్టిక్ గురించి విద్యార్థులకు తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, సదాశివయ్య, సుభాషిణి, రమాదేవి, నందకిశోర్‌తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన

నారాయణపేటరూరల్, ఏప్రిల్ 22 : ధరిత్రి దినోత్సవం సందర్భంగా పేట మండల పరిధిలోని జాజాపూర్ గ్రామ ఉన్నతపాఠశాలలో సోమవారం విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిజ్ఞ చేశారు. సైన్స్ అధికారి భానుప్రకాశ్ విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. నేను నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తానని, బజారుకు వెళ్లేటప్పుడు చేతిసంచి, నీటి బాటిల్ తప్పకుండా తీసుకువెళ్తానని, ప్లాస్టిక్ వస్తువులను తగ్గించి ఇంట, బయట కాలుష్యాన్ని అరికడతామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం కనకప్ప, ఉపాధ్యాయులు మాధవి, శోభారాణి, విజయ్‌కుమార్, మధుసూదన్, లక్ష్మణ్, శిరీష, నిర్మలతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

అప్పంపల్లిలో మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి డీకే అరుణ

గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం : డీకే అరుణ

నారాయణపేట/మరికల్, ఏప్రిల్ 22 : ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ప్రజలను మోసం చేసిందని పాలమూరు పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి డీకే అరుణ విమర్శించారు. సోమవా రం నారాయణపేట మండలంతోపాటు మరికల్ మండలంలోని అప్పంపల్లి, మాధ్వార్, పల్లెగడ్డలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు నాగురావు నామాజీ, రతంగ్‌పాండురెడ్డి, శ్రీనివాసులు, తిరుపతిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, వేణుగోపాల్, రమేశ్, శ్రీరామ్, విజయ్‌కుమార్‌రెడ్డి, పేట బీజేపీ మండల అధ్యక్షుడు రమేశ్, ఎంపీటీసీ హన్మంతు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు భరత్, విజయకుమార్ పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలు అమలుచేసే ఓట్లడగాలి

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 22 : కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల హామీని అమలు చేశాకే ప్రజలను ఓట్లడగాలని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. జిల్లా కేంద్రంలో నిర్వహించిన మహిళ నారీశక్తి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గతంలో తన మామ జైపాల్‌రెడ్డి పాలమూరు ప్రజలను తీయని మాటలతో తొక్కేశారని, ఇప్పుడు అల్లుడు సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి బెదిరించి తొక్కుతానంటే చూస్తూ ఊరుకోడానికి అమాయకులం కాదని హెచ్చరించారు.

బండారు ఉత్సవంలో ఎమ్మెల్యే శ్రీహరి

కొత్తూరులో బండారు ఉత్సవంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి

మక్తల్‌టౌన్, ఏప్రిల్ 22 : మక్తల్ మండలం కొత్తూర్‌లో కురుమయాదవులు సోమవారం నిర్వహించిన బీరప్ప బండారు ఉత్సవంలో మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి పాల్గొన్నారు. బీరప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఎమ్మెల్యేను కురుమ యాదవులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పాలమూరు కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచందర్‌రెడ్డి, బీకేఆర్ అధినేత బాలకృష్ణారెడ్డి, నాయకులు గోపాల్‌రెడ్డి, పూజారి హన్మంతు, బాలప్ప, కతలయ్య, ఆనంద్, అంజప్ప పాల్గొన్నారు.

ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలి

నారాయణపేట, ఏప్రిల్ 22 : బాధితుల ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. చట్టప్రకారం పరిశీలించి పరిష్కరించాలని సీఐలు, ఎస్సైలను ఫోన్‌లో ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఎనిమిది ఫిర్యాదులు అందాయి. ఈ సందర్భంగా ఆయన బాధితులతో మాట్లాడి ఫిర్యాదులు స్వీకరించారు. భూ సంబంధిత సమస్యలను కోర్టులో పరిష్కరించుకోవాలని బాధితులకు సూచించారు.

వేసవిలో ముందుజాగ్రత్తలు అవసరం

నారాయణపేట టౌన్, ఏప్రిల్ 22 : వేసవిలో వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని గీతా హాస్పిటల్ వైద్యులు విశ్వనాథ్, గీత అన్నారు. సోమవారం గీతా హాస్పిటల్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్న కారణంగా ఎక్కువ మొత్తంలో నీరు తాగాలని, చిన్నారులు, వృద్ధులు మధ్యాహ్న సమయంలో బయట తిరగరాదని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు తౌఫిక్, భరత్, వివేక్, స్పందన, శిరీష తదితరులు పాల్గొన్నారు.

చిన్నపొర్లలో వైద్య శిబిరం

నారాయణపేట, ఏప్రిల్ 22 : ఆరోగ్య నియమావళిని ప్రతి ఒక్కరూ పాటిస్తూ సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఏఎన్ఎం గోవిందమ్మ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దపొర్లలో పులిమామిడి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించి, రోగులకు మందులు అందజేశారు. ప్రజలకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

జడ్చర్లలో సెల్ఫీస్టిక్స్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కమిషనర్ రాజయ్య

జడ్చర్లటౌన్, ఏప్రిల్ 22 : ఓటు హక్కు కలిగిన వారంతా ఓటు విలువను తెలుసుకొని, ఓటు హక్కును వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాజయ్య అన్నారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం జడ్చర్లలోని నేతాజీచౌరస్తా, గాంధీచౌరస్తా, ఇందిరాగాంధీ చౌరస్తా, ఫ్లైఓవర్ బ్రిడ్జి కూడళ్లలో సెల్ఫీస్టిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, పట్టణవాసులు పాల్గొన్నారు.

ఓటుపై అవగాహన పెంచుకోవాలి

భూత్పూర్, ఏప్రిల్ 22 : ఓటుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపాలిటీ కమిషనర్ సురేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం కలెక్టర్ ఆదేశాల మేరకు పట్టణంలోని చౌరస్తా కూడలిలో కళాజాతా బృందంచే అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

రాజాపూర్, ఏప్రిల్ 22 : మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మచ్చందర్ సోమవారం ప్రకటనలో తెలిపారు. సమావేశానికి మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులు సకాలంలో హాజరుకావాలని ఆయన కోరారు.

మహిళ మృతిపై విచారణ

మిడ్జిల్, ఏప్రిల్ 22 : మండలంలోని వేములలో వారం కిందట అబార్షన్ వల్ల జయలక్ష్మి మృతి చెందింది. ఈ ఘటనపై సోమవా రం జిల్లా వైద్యాధికారి కృష్ణ స్థానిక వైద్యాధికారులతో కలిసి మృతురాలి భర్త తిరుపతయ్యను, కుటుంబ సభ్యులను విచారించారు. ఆయన వెంట డీఈఎం తిరుపతిరావు, మండల వైద్యాధికారి శివకాంత్ ఉన్నారు.

బైక్ అదుపు తప్పి వ్యక్తి మృతి

కోస్గి, ఏప్రిల్ 22: బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన ఘటన కోస్గిలో చోటు చేసుకున్నది. ఎస్సై శేఖర్ గౌడ్ కథనం మేరకు.. మద్దూర్ మండలం చింతల్‌దిన్నెకు చెందిన నొయంత్‌రెడ్డి(39)గా గుర్తించారు. సోమవారం తెలవారుజామున కొడుకు శివకుమార్(21)తోపాటు బైక్‌పై హైదరాబాద్ బయలుదేరగా, బోగారం గ్రామ శివారులో పంది అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. నొయంత్‌రెడ్డి తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య బాలమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.